

# మీకు తెలుసా?

హిందీ మూలం : రమేష్ ఉపాధ్యాయ్

అనువాదం : శాంత సుందరి

**మీకు తెలుసా...? నేను మెలకువగా ఉన్నప్పుడు కూడా కలలు కంటూంటాను. ఇదేమంత ఆశ్చర్యపోవలసిన సంగతి కాదు. ఈ లోకంలో ఎంతో మంది నాలాగా సర్వకాల సర్వావస్థల్లోనూ కలలు కంటూ ఉంటారు.... పూర్తిగా కళ్లు తెరుచుకునే సుమండీ! నా విషయానికొచ్చేసరికి ఇలా కలలు కనడం వలన ఒక ఇబ్బంది కలుగుతోంది. ఎదుటివారికి నా కళ్లల్లో ఉండే కలలు స్పష్టంగా కనిపించిపోతున్నాయి. దీని వల్ల నేనెన్ని రకాల ఇబ్బందులకి లోనవుతున్నానో అర్థం చేసుకోగలరనుకుంటాను!**

కళ్లు మూసుకొని నిద్రపోయే సమయంలో మీరు కనే కలలు మీ ఒక్కరికే కనిపిస్తాయి. మీరు చెబితే కానీ ఆ కలేమిటో ఎవరికీ తెలియదు. మీ కలలు ఏమిటో ఇంకొకరికి చెప్పడం, చెప్పకపోవడం అనేది పూర్తిగా మీ చేతుల్లో ఉన్న విషయం. కావాలంటే మీరు కలలని సెన్సారు చేసో, లేనిపోనివి కల్పించో చెప్పవచ్చు. ఎవరూ కనిపెట్టలేరు. కానీ నా సమస్య గురించి కాస్త ఆలోచించండి! మీరు మా పక్కింట్లో ఉంటున్నారనుకుందాం. నేను మీతో వాతావరణం గురించీ, పెరుగుతున్న ధరల గురించీ, రాజకీయాల గురించీ, లేక కొత్త మోడల్ కారు గురించీ మాట్లాడుతూ ఉంటాను. కానీ మీకు నా కళ్లల్లో ఏది కనిపిస్తుంది? మీ అందమైన భార్య, యవ్వనంలో ఉన్న మీ కూతురు నాతో తోటలో విహరిస్తూ ఏవేవో తియ్యటి కబుర్లు చెప్పడం మీరు చూస్తారు! అప్పుడు మీ పరిస్థితి ఎలా ఉంటుందో కాస్త ఆలోచించండి! మీకు ఆ సమయంలో నన్ను ఏం చెయ్యాలనిపిస్తుంది? నేను బయటి మనిషిని కాబట్టి మీరు నన్నేమీ అనకపోవచ్చు. కానీ ఇంటికెళ్లాక మీ భార్యనో, కూతుర్నో హత్య చెయ్యొచ్చు! అలా జరగదని హామీ ఇవ్వగలరా? అందుచేత మెలకువగా ఉన్నప్పుడు కలలు కనడం అనేది నాకు ఎదుటివారికీ కూడా ఎంత ప్రమాదం తెచ్చిపెడుతుందో అర్థమైందా?

అందుకే నేను ఎవరితోనూ చూపులు కలిపి మాట్లాడను... కళ్లు దించుకొని నడుస్తాను. కళ్లలోకి చూడకుండా మాట్లాడతాను. నాతో మాట్లాడేవాళ్లు నేను పిరికి వాడినని, అణిగిమణిగి ఉంటానని మర్యాద తెలియని వాడినని అనుకుంటారు. ఎంత పెద్ద చిక్కో! కానీ అది నా సమస్యలో వెయ్యోవంతు కూడా కాదు.

నా సమస్య విశ్వరూపం మీకు తెలిసేందుకు ఈ రోజు జరిగిన ఒక సంఘటన గురించి చెపుతాను. ఉదయం ఆఫీసుకు వెళ్లేటప్పుడు నేను ఒక మనిషిని గుద్దుకున్నాను. ఇది రోజూ జరిగేదే కదా! అలా ఎవరినైనా గుద్దుకున్నప్పుడు 'సారీ' అనడం నాకలవాటు. ఎవరిని గుద్దుకున్నానో కూడా చూడకుండా తలొంచుకొని వెళ్లిపోతూంటాను. ఏ కారునో గుద్దుకున్నప్పుడు కూడా దాని నెంబరు నోట్ చేసుకోవడం కానీ, నష్టపరిహారం చెల్లించమని కానీ అడగను. అసలు కళ్లెత్తి చూస్తే కదా! పైగా తప్పు అవతలివాడిదైనప్పటికీ నాదే తప్పని సరిపెట్టుకుంటాను!

కానీ ఈరోజు నేను అలా చేయలేదు. మనిషిని గుద్దుకోగానే... ఒక కోమలమైన స్పర్శ, నాకు బాగా పరిచయమున్న సెంటువాసన... నాకెంతో ఇష్టమైన నీలం చీర తాలుకూ గరగరలు, నన్ను చుట్టుముట్టాయి. కళ్లు దించుకొని 'సారీ' చెప్పి నాదారిన నేను పోకుండా కళ్లెత్తి ఆ మనిషికేసి చూశాను. అంతే... అలా చూస్తూండిపోయాను. నా ఎదుట ఉన్న స్త్రీ అద్భుత సౌందర్యరాశి! అన్నింటికంటే ఆశ్చర్యం ఏమిటంటే 'కళ్లు లేని కబోదివా? కాస్త చూసుకొని నడవలేవూ...'' లాంటి తిట్లు తిట్టకుండా ఆమె కూడా నన్నే చూస్తూ ఉండిపోయింది.

అది ఉదయం పూట బాగారద్దీగా ఉండే సమయం. ఇద్దరం రోడ్డు దాటే ప్రయత్నంలో రోడ్డు మధ్యలో గుద్దుకున్నాం. అలా గుద్దుకున్నవాళ్లం

అలాగే ఆగిపోయాం. ట్రాఫిక్ లైటు ఎప్పుడు ఎరుపుకి మారిందో... వాహనాలకి ఎప్పుడు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారో గమనించే స్థితిలో లేము. వాహనాల హారన్ మోతకి ఇద్దరమూ ఈ లోకంలోకి వచ్చి చేయిచేయి పట్టుకొని పేవ్‌మెంట్ మీదకి పరిగెత్తాం.

ఇదేదో సినిమా సీనులా ఉంది కదూ...! మేమిద్దరమూ ఎప్పుడో విడిపోయిన ప్రేమికులమనుకుంటున్నారేమో... అదేమీ కాదు... నేనెవ్వరిని ఎప్పుడూ ప్రేమించలేదు. అసలు కళ్లెత్తి చూస్తే కదా! నాకళ్లలో ఉన్న కలల్ని చూసిన అమ్మాయిలు భయపడో, అసహ్యించుకునో, కోపగించుకునో వెళ్లిపోయారు. మరి... మేమిద్దరం చేతులు పట్టుకొని పేవ్‌మెంట్ మీదకి ఎందుకు పరిగెత్తాం! ఎందుకంటే నేను కళ్లెత్తి ఆమె వైపు చూడగానే నాకు ఆ కళ్లలో కూడా నాకున్న కలలే కనిపించాయి. ఇద్దరు వ్యక్తులు వెళుతూ ఒకరినొకరు గుద్దుకున్నప్పుడు వాళ్లిదరి కళ్లు కలుసుకోవడం, వాళ్లిద్దరి కళ్లలోని కలలు ఒకటే కావడం ఆశ్చర్యంగా లేదూ? ఇదెలా సంభవమైందని విస్తుపోరూ... అందుకే ఒకరి చేయి ఒకరు పట్టుకొని పేవ్‌మెంట్ మీదకి చేరుకున్నాం. కొద్దిపాటి తేడాలతో మా ఇద్దరి కలా ఇంచుమించూ ఒకే లాంటిది.

ఇదేదో సినిమా సీనులా ఉంది కదూ...! మేమిద్దరమూ ఎప్పుడో విడిపోయిన ప్రేమికులమనుకుంటున్నారేమో... అదేమీ కాదు... నేనెవ్వరిని ఎప్పుడూ ప్రేమించలేదు. అసలు కళ్లెత్తి చూస్తే కదా! నాకళ్లలో ఉన్న కలల్ని చూసిన అమ్మాయిలు భయపడో, అసహ్యించుకునో, కోపగించుకునో వెళ్లిపోయారు. మరి... మేమిద్దరం చేతులు పట్టుకొని పేవ్‌మెంట్ మీదకి ఎందుకు పరిగెత్తాం! ఎందుకంటే నేను కళ్లెత్తి ఆమె వైపు చూడగానే నాకు ఆ కళ్లలో కూడా నాకున్న కలలే కనిపించాయి.

మా కలల్లో ఒక ఇల్లు. బయటి ప్రపంచం నుంచి మమ్మల్ని వేరు చేసే గుణం ఉన్న గోడలు మాత్రం ఆ ఇంట్లో ఉండవు. అవసరమైన వస్తువులన్నింటికీ ఆ ఇంట్లో చోటుంటుంది. మా ఇంట్లో మేం చదవదలుచుకున్న పుస్తకాలే ఉంటాయి. మాట్లాడడానికే భాషను వాడుకుంటాం. కేవలం బేరసారాలు చేయడానికే టెలిఫోన్ ఉపయోగిస్తాం.

ఇలా ఎదుటి వ్యక్తి కళ్లలో నా కలలను చూసుకోవడం నాకు సంతోషంగా ఉంది. సాధారణంగా అందరూ 'సంతోషం' అనే మాటకు ముందు ఎన్నో విశేషణాలను ఉపయోగిస్తారు. కానీ నేనలా చేయలేదు. ఎందుకంటే నాకు కావలసిన సంతోషం ఇదొక్కటే. "ఇవ్వాళ మనం ఆఫీసు ఎగ్గొట్టి రోజంతా కలిసి తిరిగితే ఎలా ఉంటుంది?" అని అడిగాను. ఆమె వెంటనే సంతోషంగా ఒప్పుకుంది.

అయితే ముందుగా ఎక్కడైనా టీ తాగుదాం!

"అలాగే!" ఇద్దరం కదిలాం.

మీరెవరు? ఏం చేస్తూ ఉంటారు? ఎక్కడుంటారు? వంటి ప్రశ్నలు ఆమె అడగలేదు. నేనూ అడగలేదు. అయినా హోటల్ చేరేవరకూ ఇద్దరమూ కబుర్లు చెప్పుకుంటూనే ఉన్నాం. మీకు తెలుసా! కబుర్లు చెప్పుకోవడానికి ఇద్దరికీ ఉమ్మడిగా వర్తించే సందర్భాలు ఉండాలి. అర్థవంతమైన సంభాషణకి వాతావరణం, ధరలు, రాజకీయాలు, కొత్త మోడల్ కార్లు, ఎందుకూ పనికిరావు. మా సంభాషణ అందుకే అర్థవంతమైనదని అనుకొంటున్నాను.

"నేనిప్పుడు నా పిల్లల్ని అస్సలు అర్థం చేసుకోలేకపోతున్నాను. వాళ్లు స్కూలుకెళ్లడం మొదలుపెట్టగానే నా భాష మాట్లాడడం మానేశారు. ఇక ఇప్పుడు వాళ్లు మాట్లాడే ఇంగ్లీషు కూడా అదో రకంగా ఉంది. వాళ్లు ఉపయోగించే పదాలు నాకు అర్థం కావడం లేదు. డిక్షనరీలో కూడా వాటికి అర్థాలు దొరకడం లేదు. వాళ్లతో మాట్లాడి, వాళ్లచేత మాట్లాడించాలని ఉంటుంది. కానీ ఆ పని ఎలా చెయ్యడం? మాట్లాడడం మాట అటుంచి అసలు నాకు వాళ్లతో ఎటువంటి సంబంధం లేదేమో అన్న అనుమానం కలుగుతోంది అంది ఆమె.

"నాకు కూడా నిరర్థకమైన సంభాషణ అంటే ఇష్టముండదు. కానీ చూస్తుంటే ఒక రచయితగా నా పరిస్థితి కూడా అలాగే కనపడుతోంది. ఏదో స్వగతం మాట్లాడుకుంటున్నట్లుగా ఉంటోంది. మునుపంతా నేను ఏది రాసినా, మాట్లాడినా ఎదుటి వారికోసమే అని అనిపించేది. వారితో నేను మాట్లాడుతున్నాననీ, వాళ్లు నా ఎదురుగా కూర్చుని నా మాటలు జాగ్రత్తగా వింటూ మధ్య మధ్య తమ అభిప్రాయాలు వ్యక్తం చేస్తూ, ఒక్కోసారి చప్పట్లు కొడుతూనో, తిడుతూనో నా వెంటే ఉన్నారని అనిపించేది. కానీ ఇప్పుడు నా వెంట ఎవ్వరూ లేనట్టుగా ఒంటరితనం నన్ను బాధపెడుతోంది.

నీ బాధ నాకర్థమవుతోంది. మీరు ఎవరితో మాట్లాడాలనుకుంటున్నారో వాళ్ల భాష కూడా మారిపోయింది. నా పిల్లల భాషలాగా. పైగా ఈ మధ్యలో కొన్నిసాధనాలు... ఎలాంటివి పుట్టుకొచ్చాయంటే వాటిని మనం అదుపులో పెట్టలేం అవి ఒకవైపు నుంచేపనిచేస్తాయి. మీ పుస్తకాలు చదివేవారుకానీ, మాటలు వినేవారు కానీ ఎంతో దూరంలో ఉంటారు. వారి ప్రతిక్రియలు మీ దరిచేరవు. ఒక వేళ చేరినా అవి మీ వరకూ వచ్చేసరికి వాటి స్వరూపం మారిపోతుంది.

ఒకవైపు పనిచేసే సాధనాల విషయం అలా ఉంచితే టెలిఫోన్ లాంటి వాటి మీద కూడా మనకు ఎటువంటి అదుపు ఉండదు. మాట్లాడుతుండగా లైన్ కట్ అయిపోతుంది. ఫోన్ డెడ్ అవుతుంది. మనం హలో... హలో... అంటూ గొంతు చించుకోవలసిందే!

హోటల్‌కెళ్లి ఇద్దరం ఎదురెదురుగా కూర్చున్నాం. అలా కూర్చోవడం అంత ఆహ్లాదంగా.. అంత ఉత్సాహంగా ఉంటుందని నేనెప్పుడూ భావించలేదు. ఎన్నో శతాబ్దాలుగా పొందాలనుకుంటూ పొందలేకపోతున్నదేదో ఆ నిమిషాన నాకు దొరికిందని అనిపించింది. ఆమె ఎదురుగా కూర్చుని కళ్లలోకి చూశాను. చూస్తే ఇంటి గురించిన కలలో ఏదో పెద్ద తేడా కనిపించింది. కల ఇంటిగురించినదే కానీ మారిపోయింది. మేమిద్దరం ఇంటికోసం వెతుకుతున్నాం.అంతటా దట్టంగా పొగమంచు కమ్ముకొని దిక్కుతోచకుండా ఉంది. కాళ్ల కింద సిమెంటు రోడ్డుకానీ మట్టి రోడ్డు కానీ లేవు. బంజరు భూమి. అంతటా మెరిసిపోతున్న దుకాణాలు పిచ్చిమొక్కల్లా తలెత్తి ఉన్నాయి. ఆ దుకాణాల నిండా ఒకటే జనం. మాకేమో ఇంటి గురించి వెతుకులాట. కానీ ఎక్కడా ఇల్లు కనపడదు. మా పిల్లలు మాత్రం ఆ దుకాణాల్లో అటూ ఇటూ తిరుగుతూ కనిపించారు.మేము వాళ్లని పిలుస్తున్నాం. మా పిలుపు వారికి వినపడడం లేదు. వాళ్లు చెవులకి ఇయర్ ఫోన్లు తగిలించుకొని ఇంగ్లీషు పాటలు వింటున్నారు. ఇక వాళ్లకి మాగొంతులేమి వినిపిస్తాయి.

కలలో దృశ్యం మారింది. దుకాణాలు మాయం అయ్యాయి. ఇప్పుడు మేం ఏదో పల్లెటూరిలో మట్టి ఇళ్ల మధ్య కప్పులూడిపోయిన పెంకుటిళ్ల మధ్య నడుస్తూ మా ఇంటి కోసం వెతుక్కొంటున్నాము. తిరుగుతూ అలసిపోయిన మేము తినడానికి ఏదైనా దొరుకుతుందేమో అని అందరిని వాకబు చేస్తున్నాం. కానీ అలాంటివి ఏమీ దొరకవని అక్కడివారు చెపుతున్నారు. మా అవస్థ ఏమిటంటే మా ఇంటికి చేరుకునే దారి పల్లెలోంచే వెళుతుంది. ఇక్కడంతా ఆకలిచావులు, కరువు బాధలూ... హోటల్‌లో ఆమెతో కూర్చుని టీ తాగుతుంటే నా కనిపించింది. ఇంటికెళ్లే దారి చాలా భయంకరమైనది, చాలా కష్టపడితేకానీ ఇల్లు చేరలేం. కానీ ఇందులోనూ ఒక సుఖం ఉంది. మేమిద్దరం కలిసే నడుస్తున్నాం.

టీ తాగుతూ, "ఈ కల మీకు ఎప్పటినుంచి వస్తోంది?" అని అడిగాను.

"పిల్లలు నేను ఒక బీద దేశంలో ఉంటున్న పాత కాలపు స్త్రీనని అనుకుంటున్నప్పటినుంచీ, ఒక పని మనిషిలాగా నా చేత అన్ని పనులు చేయించుకుంటూ,నన్ను 'స్టుపిడ్ ఉమెన్' అని పిలుస్తున్నప్పటినుంచీ! మరి మీకు?

"పిల్లలు పెరిగి పెద్దవాళ్లవుతున్న కొద్దీ నా ఇల్లు నాది కాదనీ, పరాయి ఇల్లనీ అనిపించసాగింది. అప్పట్నించీ ఈ కల కంటున్నాను. పిల్లలకి మంచి చదువులు చెప్పించి, మంచి సంస్కార వంతులుగా తీర్చిదిద్దాలని అనుకున్నాను. మంచి చదువు చెప్పించడం అంటే ఇంగ్లీషు చదువు చెప్పే ఖరీదైన పబ్లిక్ స్కూల్లో చదవడం అనుకున్నాను. బహుశా అక్కడే నేను పొరబడ్డాను. మన దేశంలోని పదో వంతు ధనికులనీ, మిగతా తొంభై శాతం మనకు చాకిరీ చేసే నౌకర్లనీ వాళ్లకి అభిప్రాయం ఏర్పడి,

వాళ్లని చాలా హీనంగా చూసే అధికారం తమ కుందని అనుకోసాగారు. నేను నౌకర్లు మాట్లాడే భాషలోనే రచనలు చేస్తానని తెలిసి, వాళ్ల భాష లోనే నేను కూడా మాట్లాడడం విని నన్ను కూడా హీనంగా చూడడం మొదలుపెట్టారు. నన్ను కూడా ఇంగ్లీషు నేర్చుకొమ్మని, ఇంగ్లీషులోనే రాయమని ఒత్తిడి చేయసాగారు. అది వీలు కాదని నేననేసరికి సరే నువ్వు నీభాషేరాయి. కానీ మన దేశంలోని పదిశాతం జనానికి పనికివచ్చే విషయాలు రాయి. అప్పుడే డబ్బూ, పేరు సంపాదించుకోగలుగుతావు. ఆ పేరుని డబ్బుగా మార్చుకొని ఇంకా ధనవంతులు కావచ్చు అన్నారు. నేను ఎంతో కష్టపడి పగలనకా, రాత్రనకా కూర్చుని రాసే రచనలని ఏవో పిచ్చి పత్రికలకి పంపిస్తానట, వాటిని చదివే వాళ్లు తక్కువ. కథలకి నాకు పత్రికల వాళ్లు డబ్బులివ్వరు అన్నారు. వాళ్లు నన్ను మూర్ఖుడి కింద, పిచ్చివాని కిందా జమకట్టారు.

''నాకుకూడా ఇంచుమించు ఇటువంటి అనుభవమే ఎదురైంది. నేను వాళ్ల లాగా ఇంగ్లీషు మాట్లాడలేనని, మాట్లాడే ఆ నాలుగు మాటల్లో కూడా ఉచ్చారణలో తప్పులుంటాయనీ వాళ్లకి వెక్కిరింపు. దాంతో నా మీద అసలు గౌరవం లేకుండా పోయింది. వాళ్లు కాస్త పెద్దవాళ్లు అవుతున్నప్పుడు ''సీదా సాదాగా ఉండర్రా, ఒంటికి ఆరోగ్యాన్నిచ్చే తిండి తినండర్రా, నాకు ఇంటిపనుల్లో కాస్త సాయం చేయ్యండర్రా'' అనేసరికి నేన్నింకా చెడ్డదాన్నాయిపోయాను. వాళ్లకిష్టమొచ్చినట్లు ఉండనిచ్చి, స్వేచ్ఛగా తిరగనిచ్చి ఏపనీ చెప్పకుండా ఇంట్లో పనులూ, ఉద్యోగం చేస్తూంటే వాళ్లకి మహా బావుంటుంది! నేను పనిచేసి అలసిపోయి ఇంటికొస్తే ఒక కప్పు టీ చేసివ్వమని అడిగే హక్కు కూడా నాకు లేదు. టీ చేయడం మా పనా? అంటారు. 'మేమేమైనా నీకు నౌకర్లమా?'' అని అడుగుతారు. నేనే వాళ్లకి పనిమనిషిని, అంతేకాదు డబ్బు సంపాదించి పెట్టే యంత్రాన్ని!

''అవును, వాళ్లు నన్ను గురించి కూడా డబ్బు సంపాదించే మెషిన్ అనే అనుకుంటున్నారు. అది కూడా చాలా పాత మోడల్‌ది! వాళ్లిప్పుడు పెద్దవాళ్లయ్యారు. నాకన్నా తెలివైనవాళ్లమని అనుకుంటున్నారు. నాతో అంటూ ఉంటారు. ''ప్రింట్ మీడియా రోజులు పోయాయి. రాయదల్చుకుంటే ఎల్‌క్ట్రానిక్ మీడియాకి రాయి. పాత టైప్‌రైటర్‌ని అవతల పారెయ్యి! కంప్యూటర్ కొనుక్కో. పుస్తకాలు చదివే అలవాటుని మానెయ్యి. ఇంటర్నెట్‌లో సెర్చింగ్ చెయ్యి.'' నాకు కొత్త వస్తువులంటే విరోధమేమీ లేదు. నావల్ల అయితే ఈ రోజే కంప్యూటర్ కొందును. కానీ డబ్బులెక్కడినుంచి తేను? ఇదే ప్రశ్న నేను అడిగితే వాళ్లు సిగ్గుపడడానికి బదులు నన్ను వెక్కిరిస్తూ ఉంటారు. వారి మాటలు వింటున్నప్పుడు ' ఈ ఇల్లు నాది కాదు!' అనిపిస్తుంది.

''నేను ఒకటి నిర్ణయించుకున్నాను. వాళ్లని పట్టించుకోకుండా ఉంటాను. పెంచి పెద్ద చేశాను. చదువు చెప్పించాను. ఇక ఏం చేస్తారో... ఎలా బతుకుతారో... వాళ్లిష్టం''

''నేను కూడా అదే చేస్తాను''

''కానీ ఒక సంగతి చెప్పు!రోడ్డు మీద నడిచేటప్పుడు మీరు తల దించుకొని నడుస్తారేం? మీ కొత్తింటి కల గురించి సిగ్గుపడుతున్నారా? లేక అందరూ ఏమనుకుంటారోనన్న భయమా?''

''అవును భయమే'' అని కొంతసేపు ఆలోచనలో పడిపోయాను. కొద్దిసేపటికి మళ్లీ...చూసేవారికి నా కళ్లల్లో కలలన్నీ స్పష్టంగా కనపడతాయి. అలా కనపడగానే నన్ను జైలుకో... పిచ్చాసుపత్రికో.... పంపించాలని అనుకుంటారు. నిజానికి వాళ్లలో కూడా చాలా మంది మనిద్దరిలాగా తమ ఇళ్లలో పరాయివారుగా మిగిలిపోయిన వారే! వారికీ కొత్త ఇల్లు కావాలని ఉంటుంది. కానీ దాని గురించి కలలు కనాలంటే భయం '' అన్నాను.

అయితే మరిప్పుడేం చేస్తారు?

''వారానికి ఒకసారి ఇలాగే ఎవరినైనా గుద్దుకుని ఆరోజంతా వారితో సరదాగా గడిపి ఇంటికెళ్తే బావుంటుందనుకుంటున్నాను.''

''సరే బైటకెళ్లి అలా తిరిగి వద్దామా?''

''అలాగే పదండి''

హోటల్లో, బయటకు వచ్చి ఎక్కడికెళ్లాలో తేల్చుకోకుండానే ఒక దిక్కుగా నడిచాం.

మీకు తెలుసా? ఢిల్లీలాంటి ఆధునికమైన నగరంలో ఈనాటి అత్యాధునిక యుగంలో కూడా నేను చెప్పిన సంఘటనని ఎవరూ నమ్మరు. అదెలా సాధ్యం? ఆఫీసుకెళ్తున్న ఇద్దరు నడివయస్కులు ఎదిగిన పిల్లలున్న ఆడా, మగా ఉన్నట్టుండి రోడ్డు మధ్యలో గుద్దుకొని యువప్రేమికుల్లా ఆఫీసు ఎగ్గొట్టి సరదాగా తిరగడమా? అందుకే నిజంగా జరిగిన ఈ సంఘటన నేను కథా రూపంగా ఇచ్చి ముగిస్తాను. మిమ్మల్ని చకితులని చేయడం నా ఉద్దేశం కాదు. నేనివాళ దారిలో వెళ్తూ గుద్దుకున్నది మరెవర్నో కాదు నా భార్యనే... బహుశా ఈ విషయం మీకు మొదటినుంచే తెలుసనుకుంటాను! ★

